నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 23 మార్చి 2025 | NAGARKURNOOL

రైతు కంట కన్నీరు

నాగవరం తండాలో ఎండుతున్న వరి పైరును పశువులకు కోస్తున్న మహిళా రైతు సుజాత

- యాసంగి రైతుకు కోలుకోలేని దెబ్బ
- పక్షం రోజుల్లో ఎండిన 20 బోర్లు

వనపర్తి, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : యాసంగిలో సాగు చేసిన రైతులు అయోమయంలో పడిపోయారు. బోరు బావులపై ఆధారపడి పంటలు సాగు చేయగా, భూగర్భజలాలు అడుగంటి నీళ్లు రాకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొన్నది. ఒక్క నాగవరం తండాలోనే పక్షం రోజుల్లో 20బోర్లు నిలిచిపోయాయంటే వేసవి ప్రతాపం ఎలా ఉందో ఇట్టే తెలుసుకోవచ్చు. అకస్మాత్తుగా భూగర్భజలాలు ఇంకిపోవడంతో బోర్లన్నీ పాతాళానికి పడిపోయాయి

ఎండుముఖం పట్టాయి..

వనపర్తి మండలం నాగవరం తండాలో రైతులంతా అధికంగా బోరుబావులపై ఆధారపడి సేద్యం చేస్తున్నారు. వీరికి చెరువు కింద సేద్యం చాలా తక్కువ. రాజనగరం అమ్మచెరువు నిండితే అక్కడి నుంచి అలుగులో వచ్చే నీరు రాజాపేట చెరువుకు తండా రైతుల పొలాల్లోని ఓడికల ద్వారా నీళ్లు వెళ్తాయి. ఈ వనరు తప్పా మరొక నీటి వసతి లేదు. రాజనగరం చెరువు వనపర్తి పట్టణ మురుగు కాల్వల నీరంతా చేరి నిండుగా ఉంటుంది. వానకాలంలో అంతంత మాత్రమే పంటలు పండించిన ఇక్కడి రైతులు వర్షాలు బాగా కురియడంతో యాసంగి సాగుపై దృష్టి పెట్టారు. వరి తోపాటు జొన్న, తైదలు, వేరుశగ సాగు చేశారు. కాగా, 15 రోజులుగా నీటి వసతి లేక పోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి.

పక్షం రోజుల్లోనే 25 బోర్లు..

పక్షం రోజుల్లోనే తండా పరిధిలోని 25మంది రైతుల బోర్లు అకస్మాత్తుగా తగ్గిపోవడం గిరిజన రైతులను అందోళనకు గురి చేస్తున్నది. పంట చేతికొచ్చే దశలో ఇలా బోర్లు తగ్గడంతో రైతులంతా అయోమయంలో పడ్డారు. తగ్గిన బోర్లన్నీ ప్రధాన రోడ్డును అనుసరించి ఉండగా, మరికొన్ని పెదమాల ప్రాంతంలో ఉన్నాయి. ఎండిన బోర్ల రైతులు కొందరు అదనపు నీటి వనరులను సమకూర్చుకోగా, మరి కొందరు చేసేది లేక పంటలను గొర్రెలకు మేతగా వదిలేశారు.

ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు పోమానాయక్. వనపర్తి మండలం నాగవరం తండా. ఇతడికి సొంతంగా రెండెకరాల పొలం ఉన్నది. ఐదేండ్లుగా మరో మూడెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. ఎప్పటిలాగే ఈ యాసంగిలోనూ కౌలుకు తీసుకున్న పొలంలో వరి సాగు చేశాడు. పొలానికి బోరు ద్వారా నీటి వసతి ఉన్నది. ప్రస్తుతం పొట్ట దశకు పంట చేరుకున్నది. మరో 20 రోజులు నీటి తడులు అందితే పంటచేతికొచ్చేది. మార్చి నెల నుంచి బోరులో నీరు తగ్గింది. దీంతో ఎకరా పంట నీరందక ఎండిపోయింది. గొర్రెలకు మేతగా ఇచ్చాడు. ఉన్న పొలానికి నీరందడం లేదు. చేతికొచ్చిన పంట కండ్ల ముందే ఎండిపోతుండడంతో పొలాన్ని చూస్తూ దుఃఖసాగరంలో మునుగుతున్నారు. రూ.లక్ష పెట్టుబడి పెట్టి చేసిన కష్టం గాలిలో కలిసిపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎండిన వరి చేనులో దిగాలుగా పోమానాయక్

అప్పులే మిగిలాయి..

- మూడెకరాల్లో వరిపంట నష్టం
- మూడు బోర్లు వేసినా చుక్కనీరు రాలే..
- రైతు సందరాజు ఆవేదన

ధన్వాడ, మార్చి 22 : ధన్వాడకు చెందిన రైతు సంద రాజు తన ముడెకరాల పొలంలో వరి సాగు చేశాడు. పంట చేతికొచ్చే సమయంలో భగర్భజలాలు అడుగం టిపోవడంతో బోరు మోటరులో నీళ్లు బంద్ అయ్యాయి. ఎలా గైనా పంటను కాపా డుకోవాలని రూ.లక్ష అప్పు తెచ్చి మూడు సార్లు బోర్లు వేసినా ఫలితం దక్కలేదు. మూడెకరాల పంట సాగుకోసం పెట్టుబడి రూ.లక్ష వరకు ఖర్చయ్యిందని, తీరా బోరు చెడిపోవడంతో కొత్తగా వేసేందుకు మరో రూ.లక్ష ఖర్చయ్యిందని రైతు రాజు ఆవేదన చెందుతున్నాడు. సర్కారు స్పందించి నష్టపరిహారం అందించాలని ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఎండిన పంటను చూపుతున్న రైతు రాజు, పొలంలో బోరు డ్రిల్ చేసినా పడని నీళ్లు

- తగ్గిన భూగర్భ జలాలు
- నెర్రెలుబారిన పొలాలు
- చేతికందే దశలో సాగునీటి కష్టాలు
- నాగవరం తండాలో గిరిజనుల ఆవేదన

బోర్లు ఎండిన రైతుల వివరాలు

పోమానాయక్, జానానాయక్, నెహ్రూనాయక్, జగన్, అమృనాయక్, హేమ్లానాయక్, లాలునాయక్, బాబునాయక్, జగన్, సబావత్ లాలు, కిషన్, శాంతమ్మ, ఎం.సుధాకర్, వెంకటేశ్, మణ్యంనాయక్, హన్మంతునాయక్, బిచ్చానాయక్, చిన్నమణ్యం, తీరానాయక్, రమేశ్, రొట్టెల మణ్యం, తిరుపతయ్య, గొల్ల నాగన్న బోర్లు పక్షం రోజుల్లోనే తగ్గిపోయాయి

కరెంటు, నీళ్లు లేక పంట ఎండిపోయిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న కిష్టారం రైతులు

కరెంట్, నీళ్లు లేక సాగుబడి ఏదీ?

- కిష్టారం రైతుల ఆవేదన

జడ్చర్ల టౌన్, మార్చి 22 : కరెంటు ఎప్పుడొస్తదో.. ఎప్పుడు పోతదో తెలుస్తలేదు. కరెంటు లేక నీళ్లు రాక చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయంటూ జడ్చర్ల మండలం కిష్టారం గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి పంటలు పండిస్తే కరెంటు, నీళ్లు లేక ఎండిపో తున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ శనివారం ఆ గ్రామ రైతులు ఎండిన వరి పంట వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు కరెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

పంట ఎండుముఖం.. అన్నదాత ఆందోళన


నందారం శివారులో నెర్రెలుబారిన వరిపొలం

బాలానగర్, మార్చి 22 : ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటలు ఎండిపోతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి బాలానగర్ మండలంలోని పెద్దరేవల్లి, చిన్న దేవల్లి, మొదంపల్లి, బోడ జానంపేట, తిర్మలగిరి, నందారం, ఏడుగుట్టలతండా, మల్లేపల్లి, ఈద్గానిపల్లి, హేమాజిపూర్ తదితర గ్రామాల్లో రైతులు సాగుచేసిన వందల ఎకరాల్లో వరిపంటలు నీరు లేక ఎండిపోతున్నాయి. భూగర్భజలాలు గరిష్ట స్థాయికి పడిపోవడంతో బోర్లలో చుక్కనీరు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీల ఖర్చులు, ఎరువులు కొనుగోలు, ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటలు చేతికొచ్చే దశలో ఎండిపోతుంటే భరించలేక పోతున్నామని, తిండి గింజలు, పశువులకు పశుగ్రాసం కూడా మిగిలే పరిస్థితి లేదని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

నీళ్లు లేక పంట ఎండిపోయింది..

భూగర్భజలాలు పడిపోవడంతో బోర్లలో నీళ్లు రావడం లేదు. చెరువులు, కుంటల కింద ఉన్న పొలాలకు సైతం నీరందే పరిస్థితి లేదు. అడుగంటిపోయిన భూగర్భజలాల కారణంగా చాలా చోట్ల పంటలు ఎండిపోతున్నాయి. పరిస్థితిని జిల్లా ఉన్న తాధికారులకు నివేదిస్తాం.

- సుజాత, ఏవో బాలానగర్

వడగండ్ల వాన

హన్వాడ, వేములలో కురిసిన వర్షానికి పడిన వడగండ్లు

హన్వాడ, మార్చి 22 : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలో శనివారం రాత్రి వడగండ్ల వర్షం కురిసింది. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో.. ఈదురుగాలులతో 7:30 నుంచి 8:15 వరకు కురిసిన వర్షంలో వడగండ్లు పడ్డాయి. వడగండ్లతో కొద్దిసేపు వాహనాలు నిలిచిపోయాయి.

ముసాపేట, అడ్డాకుల మండలంలో..

మూసాపేట, మార్చి 22: మండలంలోని వేముల, దాసరిపల్లిలో భారీ వడగండ్ల వాన కురిసింది. శనివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం మొదలైంది. వర్షం ప్రారంభమైన కొంత సమయంలోనే పెద్దఎత్తున వడగండ్ల వర్షం కురిసింది. కొంత సమయంలోనే ఇండ్ల ముందు వడగండ్లు కుప్పలు, తెప్పలుగా పడి ఉన్నాయి. చూసిన రైతులు తమ పంటలకు తడి వచ్చిందని కొందరు సంతోషం వ్యక్తం చేయడం తోపాటు కొంతమంది రైతులు తమ పంటలు దెబ్బతిని ఉంటాయని ఆందోళన పడ్డారు. మూసాపేట మండలంలోని ఆయా గ్రామాలతో పాటు, అడ్డాకుల మండలంలోని ఆయా గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.

ఎండిపోయిన వరి పైర్లను గొర్రెలను మేపుతున్న కాపరులు

నట్టేట మునిగాం..

- సాగునీళ్లున్నా ఎండుతున్న పంటలు
- రాజాపూర్‌లో రైతుల ఆవేదన

కోడేరు, మార్చి 22 : చేతికొచ్చిన పంట కండ్ల ముందే ఎండిపోతుంటే రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. పొట్ట దశలో ఉన్న పంటలకు నీళ్లు అందక పోవడంతో చేసేది లేక గొర్రెలకు మేతగా వదిలేశారు. కోడేరు మండలం రాజాపూర్‌కు చెందిన బొల్లెద్దుల లక్ష్మయ్య 2.20 ఎకరాలు, రాములు 35 గుంటలు, పల్లె దాసు ఎకరాతో పాటు చాలా మంది రైతులు వరి పంటలను సాగు చేశారు. కేఎల్ఐలో భాగంగా డీ-5 కాల్వ ద్వారా సాగునీరు అందేది. మొదట్లో సమృద్ధిగా నీళ్లు ఉన్నాయని వరి పంటలను సాగుచేయగా, 10రోజుల నుంచి కాల్వ నీళ్లు అందకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. పొట్ట దశకు వచ్చిన పంట కండ్ల ముందే కనుమరుగవుతుంటే ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా, ఎంజీకేఎల్ఐ డీ-8 కాల్వ ద్వారా డీ-5 కాల్వకు నీళ్లు అందాల్సి ఉంది. అయితే పాన్‌గల్ మండలం రేమొద్దుల గ్రామ శివారులో కొందరు రైతులు అడ్డంగా సంచులు వేయడంతో కాల్వ నీటి సరఫరా నిలిచిపోయి ఈ దుస్థితి నెలకొన్నదని రైతులు వాపోతున్నారు. 10రోజులుగా నీళ్లు అందక పోవడంతో చేతికొచ్చిన పంటలను గొర్రెలకు మేతగా వదిలేసినట్లు రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అప్పులు తెచ్చి ఎకరాకు రూ.35వేల చొప్పున పెట్టుబడి పెట్టామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

చేసిన కష్టం మట్టిపాలు..

నీళ్ల సవలతు మంచిగా ఉన్నదని వరి పంటలు సాగు చేసినం. పంటలు చేతికొచ్చే సమయంలో నీళ్లు అందక ఎండిపోయినయి. ఎండిన పంటలను చూస్తే కండ్ల నీళ్లు తిరుగుతుండయి. పెట్టుబడి పోయే.. చేసిన కష్టం దక్కకపాయే. తిండి గింజలు లేక పస్తులండాల్సిన పరిస్థితొచ్చింది. సారోళ్లకు చెప్పినా చెవిన పెట్టడం లేదు. సర్కారన్నా సాయం చేసి ఆదుకోవాలే.

- బీ.లక్ష్మయ్య, రైతు, రాజాపూర్, కోడేరు మండలం

జలదోపిడీని అడ్డుకుందాం

- నల్లగొండకు నీళ్లు తరలించేందుకు సర్కారు కుట్ర
- పాలమూరుకు అన్యాయం చేస్తే సహించేది లేదు
- సీఎం, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు స్పందించాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరైన జేఏసీ, వివిధ పార్టీల నాయకులు

కల్వకుర్తి, మార్చి 22 : ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రతి ఎకరాకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు ఇవ్వాలని పాలమూరు అధ్యయన వేదిక డిమాండ్ చేసింది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా నల్లగొండకు సాగునీరు ఇవ్వకుండా అడ్డుకోవాలని, కేఎల్ఐ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలనే డిమాండ్‌తో శనివారం కల్వకుర్తి పట్టణంలోని టీయూటీఎఫ్ భవనంలో పాలమూరు అధ్యయన వేదిక, కల్వకుర్తి జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవా చారి, ఇరిగేషన్ నిపుణులు కేవీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీలకతీతంగా హాజరైన నాయకులు, నేతలు జలదోపిడిపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాఘవా చారి మాట్లాడుతూ 1956 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుతోనే నీళ్ల విషయంలో పాలమూరుకు అన్యాయం ప్రారంభమైందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మన కండ్ల ముందే మనకు దక్కాల్సిన సాగునీటిని నల్లగొండ జిల్లాకు తరలించుకు పోతుంటే అడ్డుకోవాల్సిన జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వలసల జిల్లాగా మారిన పాలమూరు జిల్లాకు దక్కాల్సిన కృష్ణా జలాలను ఏడుల రిజర్వాయర్ ద్వారా నల్లగొండ జిల్లాకు తరలించే కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి సీఎంతో పాటు ఎమ్మెల్యేలు నోరు మెదపక పోవడం విచారకరమన్నారు. అనంతరం నల్లగొండకు పాలమూరు నీటి తరలింపును అడ్డుకోవాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో జేఏసీ చైర్మన్ సదానందం, నాయకులు ఆంజనేయులు, పరుశురాములు, బాబిదేవ్, పరశురాములు, అంజి, రాజేందర్, గోపాల్, సైదులు, బాలయ్య, జంగయ్య పాల్గొన్నారు.

బస్సులు, సిబ్బంది కొరత ఉంది

రాత్రి వేళల్లో హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్‌కు ప్రయాణికుల అవసరాన్ని బట్టి బస్సులను నడిపిస్తాం. ఓ వైపు బస్సుల కొరత, మరోవైపు సిబ్బంది కొరత ఉన్నది. పగటివేళల్లో హైదరాబాద్‌కు ఇప్పటికే చాలా బస్సులు నడిపిస్తున్నాం. రాత్రి వేళ అదనంగా బస్సులను నడిపించి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

- యాదయ్య, ఆర్టీసీ డిపో మేనేజర్, నాగర్‌కర్నూల్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

కొల్లాపూర్ ప్రయాణికుల డిమాండ్‌ను పరిగణలోకి తీసుకొని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఈ డిపో నుంచి అన్ని రూట్లల్లో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సర్వీసులు నడుపుతున్నాం. ఒకవేళ ఏమైనా ఇబ్బందులు వస్తే వెంటనే పరిష్కరిస్తాం.

- ఉమాశంకర్‌గౌడ్, ఆర్టీసీ డిపో మేనేజర్, కొల్లాపూర్

కొల్లాపూర్‌కూ అంతంతే..

- రాత్రయితే బస్సుల కోసం ప్రయాణికులకు వెయిటింగే..

కొల్లాపూర్, మార్చి 22 : నాడు కొల్లాపూర్ అంటే.. కోస్ పూచ్‌తా కొల్లాపూర్ అనేవాళ్లు.. కానీ కేసీఆర్ ప్రభుత్వంలో టూరిజం హబ్‌గా మారడం.. పర్యాటకుల సంఖ్య పెరగడంతో ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందింది. అంతగా ఫేమస్ అయిన పట్టణం నుంచి సాయంత్రం 6గంటలైతే చాటు హైదరాబాద్‌కు వెళ్లేందుకు బస్సులు ఉండవు. అలాగే హైదరాబాద్ నుంచి కొల్లాపూర్ రావాలన్న అదే పరిస్థితి. రాత్రి 8గంటలకు బస్సు బయలుదేరితే.. మళ్లా 11 గంటలకే.. రెండు ట్రిప్పుల మధ్య దాదాపు 3 గంటల తేడా ఉండడంతో ప్రయాణికులకు పడిగాపులు తప్పడం లేదు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొల్లాపూర్‌కు బస్సు సౌకర్యం లేక పోవడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులను తిప్పాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

రాత్రి సమయంలో కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లాలన్నా.. హైదరాబాద్ నుంచి కొల్లాపూర్‌కు రావాలన్నా.. బస్సుల షాటేజ్ బాగా ఉన్నది. కొల్లాపూర్ 6 గంటల తర్వాత రాష్ట్ర రాజధానికి బస్సులు నడపాలి. అలాగే హైదరాబాద్‌లో 8 నుంచి 11 గంటల మధ్యలో మరిన్ని బస్సులు నడిపితే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుంది. గతంతో పోల్చితే ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగింది. అయినా బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్టీసీ అధికారులు చొరవ చూపాలి.

- ప్రసాద్, కొల్లాపూర్ నివాసి, నాగర్‌కర్నూల్ జిల్లా

వేసవిలో సల్లకుండ

- పేదోడి ఫ్రిజ్‌కు భలే డిమాండ్
- నేడు భారీగా పెరిగిన వినియోగం

మల్దకల్, మార్చి 22 : రోజురోజుకూ ఎండలు ముదురుతుండడంతో చల్లని వ్యాపారాలు జోరందుకున్నాయి. వేసవి దాహం తీరేలా మట్టి కుండల వినియోగం పెరిగింది. పేదోడి ఫ్రిజ్‌గా పేరొందిన కుండలను కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. సిద్ధంగా తయారు చేసిన ఈ కుండలు, కృత్రిమంగా తయారు చేసిన ఫ్రీజులు కంటే ఎంతో మంచివి. రూ.వేలు ఖర్చు చేసి ఫ్రీజులను కొనుక్కోలేని ప్రజలు చల్లని నీటితో వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు కుండలను వాడుతున్నారు. ఇందులోని నీరు స్వచ్ఛమైనది కావడంతో పలువురు వీటిని వినియోగిస్తున్నారు. వీటికి కరెంట్‌తో పని లేదు.. ఒకవేళ పగిలిపోయినా మళ్లా కొనుక్కోవచ్చు. మార్కెట్‌లో ఒక్కో కుండ ధర రూ.50 నుంచి రూ.200 వరకు అందుబాటులో ఉన్నాయి. ఎండలో వచ్చిన వారు కుండలోని స్వచ్ఛమైన నీరు తాగితే ఎంతో ఉపశమనం పొందడం ఖాయం. గ్రామీణ ప్రాంతాల్లో కుండలను తయారు చేసి ప్రత్యేకంగా బట్టిల్లో కాల్చుతారు. అందుకే కుండలకు అంత డిమాండ్. పల్లెల్లో కుండల్లోనే పాలు, పెరుగును కాచి తోడు పెట్టడం తోపాటు మజ్జిగా చిలకడంతో రుచి వస్తుంది. వేసవిలోనే వీటి వినియోగం ఎక్కువ. అందుకే పెద్దమొత్తంలో కుమ్మరులు వీటిని రెడీ చేసి విక్రయిస్తుంటారు.

మల్దకల్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి కుండలు

రాత్రి 9 దాటితే..

- హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్‌కు బస్సులు కరువు
- 11 గంటల కొల్లాపూర్ బస్సే దిక్కు
- సీట్లు లేక 3 గంటలపాటు నరకప్రాయం
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

పట్నంలో పడిగాపులే..

నాగర్‌కర్నూల్, మార్చి 22 : పేరుకే జిల్లా కేంద్రం.. రాత్రి 9 దాటితే బస్సులు కరువు.. హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్‌కు రాత్రివేళల్లో చేసే ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ సమయంలో సర్వీసులు తక్కువగా ఉండడంతో వివిధ పనుల నిమిత్తం రాష్ట్ర రాజధానికి వెళ్లిన ప్రయాణికులకు బస్సు కోసం పడిగాపులు తప్పడం లేదు. నిత్యం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం తోపాటు కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, తెలకపల్లి, బిజినేపల్లి మండలాల నుంచి ప్రయాణికులు వందలాదిగా హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లి వస్తుంటారు. గతంతో ఎంజీబీఎస్ బస్టాండ్ నుంచి రాత్రివేళల్లో బస్సులు బాగా తిరిగేవి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించారు. ఈ నేపథ్యంలో రాత్రి సమయంలో బస్సుల సంఖ్యను పూర్తిగా తగ్గించారని అధికారులపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ డిపో బస్సులంటేనే సమయానికి రావని, వచ్చినా వరుసగా వెంట వెంటనే వెళ్తుంటాయని పలువురు ఆరోపిస్తున్నారు. అదే ఉదయం సమయంలో ఫుల్‌గా ఉండే బస్సులు.. రాత్రి అయితే జాడ లేకుండా పోతున్నాయని పేర్కొంటున్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో రద్దీ పెరిగిన నేపథ్యంలో అదనంగా బస్సులు నడిపించాల్సిన అధికారులు వాటి సంఖ్యను తగ్గిస్తే ఎలా అని ప్రయాణికులు నిలదీస్తున్నారు. ప్రస్తుతం రంజాన్ సీజన్ కావడంతో షాపింగ్.. ఇతర పనుల నిమిత్తం రాత్రి సమయంలో ఆలస్యంగా వచ్చే తాము 11 గంటల తర్వాత హైదరాబాద్‌లో బయలుదేరే చివరి కొల్లాపూర్ బస్సు కోసం రెండు గంటల పాటు నిరీక్షించాల్సి వస్తుందని పలువురు ముస్లింలు వాపోతున్నారు. కొన్ని సార్లు బస్సులేక వనపర్తి డిపో బస్సులను ఆశ్రయించి బిజినేపల్లి వరకు వచ్చినా.. అక్కడి నుంచి 13 కిలోమీటర్ల దూరంలోని నాగర్‌కర్నూల్‌కు వెళ్లేందుకు.. కొన్ని సార్లు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నామని.. కొందరు రాత్రిళ్లు ఆపడం లేదని.. దీంతో దోమల బెడద మధ్య గంటల తరబడి అక్కడే వేచి ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతో 3 గంటల ప్రయాణం కాస్తా సాగుతూ ఐదారు గంటల వరకు కొనసాగుతుండడంతో ప్రయాణికులు బేజారెత్తి పోతున్నారు. రాత్రి వేళల్లో బస్సుల రాక పోకల గురించి పలుమార్లు ఆర్టీసీ డిపో అధికారులకు విన్నవించినా ఒకటి రెండ్రోజులు నడిపి.. తర్వాత పరిస్థితి మళ్లీ మొదటికే వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా నాగర్‌కర్నూల్ డిపో అధికారులు స్పందించి రాత్రి 9 గంటల తర్వాత హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్‌జిల్లా కేంద్రానికి బస్సులను నడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.